మల్లారెడ్డి కుటుంబానికి పరామర్శ



మల్లారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

తొగుట, అక్టోబర్11: మండలంలోని జప్తి లింగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్, సొసైటీ మాజీ చైర్మన్ ఎన్నం మల్లారెడ్డి కుటుంబాన్ని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డితో మాట్లాడి ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపం ప్రకటించారు. సర్పంచ్‌గా, సొసైటీ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు.అనంతరం గ్రామంలో ఇటీవల మరణించిన జూపల్లి సత్తయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాందెడ్డి, నాయకులు మల్లారెడ్డి, జానారెడ్డి, గోవిందరెడ్డి, బాలేశ్, ఎన్నం యాదవరెడ్డి, పులీందర్‌రెడ్డి, స్వామి గౌడ్, మంగళి బాలరాజు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేస్తున్న ఖాజా తదితరులు

చేర్యాల, అక్టోబర్ 11 : మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన మాచర్ల బాల మల్లు కుమారుడు శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖాజా శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, నాయకులు ఒగ్గ మల్లేశం, తుమ్మ శ్రీనివాస్, ఎర్ర మైసగల్ల గణేశ్, మాచర్ల సోమయ్య, వెంకట్, రమేశ్, రాచమల్ల నర్సింహులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో క్రీడాకారుడికి ఆర్థికసాయం

క్రికెటర్ ప్రశాంత్‌కు సహాయం అందజేస్తున్న ఆపన్నహస్త మిత్రబృందం సభ్యులు

గజ్వేల్, అక్టోబర్ 11: గజ్వేల్ పట్టణానికి చెందిన శంభు ప్రశాంత్ జాతీయస్థాయిలో ఆడే రాష్ట్రస్థాయి క్రికెట్‌జట్టుకు ఎంపికయ్యాడు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ప్రశాంత్‌కు అవకాశం రావడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. ఈనెల 14న రాజస్థాన్‌లో జరిగే క్రీడల్లో పాల్గొనాలంటే అతని వద్ద ఖర్చులకు డబ్బులు లేక గజ్వేల్‌కు చెందిన ఆపన్నహస్త మిత్రబృందం వారు అతడికి విమాన ఖర్చుల కోసం శుక్రవారం రూ.20వేల సాయం చేశారు. అధ్యక్షుడు పాశకంటి బాల చంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యామ్, స్వామి, రాంబాబు, శ్రీకాంత్, సత్యనారాయణ, బాల శేఖర్, అభినవ్, గౌతమ్‌కృష్ణ, నవీన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

ఆలయ అర్చకుడికి విరాళాన్ని అందజేస్తున్న శనిగరం సత్యనారాయణ

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్11: మద్దూరు మండలంలోని నర్సాయపల్లి సీతా రామ శతరుద్రేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఆలయ చైర్మన్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ శనిగరం సత్యనారాయణ రూ. 101 116 విరాళాన్ని ఆలయ అర్చకుడు చంద్రశేఖర్‌శర్మకు శుక్రవారం గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం పెద్ద మొత్తంలో విరాళాన్ని అందజేసిన సత్యనారాయణను గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. శ్రీపతిరెడ్డి, పాతూరు జితేందర్ రెడ్డి, కొమ్మూరి శ్రీనివాస్‌రెడ్డి, శనిగరం కనకయ్య, శనిగరం బాలరాజు, కవ్వం భాస్కర్ రెడ్డి, బద్దిపడగ నవీన్‌రెడ్డి, చిలువేరు ఉత్తరయ్య, మోకు కనకారెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న వైస్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 11: హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని పలు వార్డులకు చెందిన 24 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణలక్ష్మి మహిళలకు చేయూతగా నిలుస్తున్నదని చెప్పారు. కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, వైస్‌చైర్‌పర్సన్‌అనిత, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై డీఆర్డీవో సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న డీఆర్డీవో జయదేవ్‌ఆర్య

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్11: మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామాన్ని డీఆర్డీవో జయదేవ్ ఆర్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు, మహిళా సంఘాల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2025-26లో గ్రామాల్లో చేపట్టే పనులను గుర్తించాలన్నారు. కూలీలకు వంద రోజులు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఈజీఎస్ అధికారులపైన ఉందన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, ఈసీ పరశురాములు, ఏపీఎం బాబురావు, పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, టీఏలు, ఎఫ్ఏలు, సీసీలు పాల్గొన్నారు.

పరిస్థితి విషమించి యువకుడి మృతి

దుబ్బాక,అక్టోబర్11: తాగుడుకు బానిసగా మారిన ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను దుబ్బాక పోలీసులు వెల్లడించారు. మండలంలోని పద్మనాభంపల్లికి చెందిన వేముల రవితేజ (27) గత సంవత్సరం పక్క గ్రామమైన కొండాపూర్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొద్ది రోజుల్లోనే వారిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తడంతో విడాకులు తీసుకున్నారు. రవితేజ గ్రామంలో టెంట్‌హౌస్‌లో కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడు. భార్య దూరం కావడంతో తాగుడుకు బానిసగా మారాడు. జీవితంపై విరక్తి చెందిన రవితేజ వారం రోజుల కిందట గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రవితేజను సిద్దిపేట దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మరో ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

చేర్యాల: కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట): మద్దూరులో దుర్గామాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



కొండపాక(కుకునూరుపల్లి): మర్పడక క్షేత్రంలో మహిషుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

హుస్నాబాద్‌టౌన్: పట్టణంలోని గాంధీరోడ్డులో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మహిషాసురమర్దినిగా

దుర్గాదేవి

జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ,అక్టోబర్ 11

మర్కూక్: దేవీశరన్నవరాత్రి పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి: అమ్మవారి వద్ద పూజలు చేస్తున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి తదితరులు

వర్గల్: అమ్మవారిని దర్శించుకుంటున్న బీజేపీ అగ్రనేత లక్ష్మణ్ కుటుంబసభ్యులు

వర్గల్: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మహిళలకు చీరెలు పంపిణీ

మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న డాక్టర్ నరేశ్‌బాబు, డాక్టర్ వాసవాచారి

గజ్వేల్, అక్టోబర్ 11: గజ్వేల్ పట్టణంలోని బీడీ కాలనీలో నివాసం ఉంటున్న సంచారజీవులకు శుక్రవారం మాతృభూమి సంస్థ సహకారంతో డాక్టర్ వాసవాచారి నేతృత్వంలో అన్నదానం చేశారు. అనంతరం మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేశ్‌బాబు, డాక్టర్ వాసవాచారి మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయడంలో ఎంతో సంతృప్తి కలుగుతుందని, అత్యంత పేదలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో మాతృభూమి సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు పట్టణవాసులు పాల్గొన్నారు.

చందుకు అభినందనల వెల్లువ

డాక్టరేట్ అందుకున్న చందును అభినందిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 11: బీఆర్ఎస్వీ నాయకులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటు కోసం వారి పోరాటాలు మర్చిపోలేమని, అనంతరం ఉన్నత స్థాయికి ఎదిగేందుకు చదువుతున్న తీరు ఆదర్శనీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన గదరాజు చందు 'దొమ్మర కులస్తుల సాంస్కృతిక-సాహిత్య పరిశీలన' అనే అంశం ఎంచుకుని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు గోనానాయక్ మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తి డాక్టరేట్ అందుకున్నారు. ఎమ్మెల్యే పల్లా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో చందుకు శాలువా కప్పి అభినందించారు..అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని, కేసీఆర్ సైతం చిన్ననాటి నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని రాష్ట్రాన్ని సాధించి ముఖ్యమంత్రిగా విధులు నిర్వహించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాడన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ నాయకులు పెడుతల ఎల్లారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, శివగారి అంజయ్య, గదరాజు యాదగిరి, ఏర్పుల మహేశ్, సూటిపల్లి బుచ్చిరెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్, జితేందర్‌రెడ్డి, చుక్కారెడ్డి పాల్గొన్నారు.

ఏటీఎం ప్రారంభం

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 11 : ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ సేవలను విస్తృతస్థాయిలో ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చామని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక మండలంలోని దుద్దెడలో డీసీసీబీ బ్యాంకు ఆవరణలో నూతన ఏటీఎం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్‌రావు, బ్యాంకు మేనేజర్, నాయకులు మల్లికార్జున్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దుద్దెడలో డీసీసీబీ నూతన ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి

అమృతం.. సీతాఫలం

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాజీవ్ రహదారి కొమురవెల్లి గేటు వద్ద సీతాఫలాల క్రయవిక్రయాల సందడి నెలకొన్నది. కొమురవెల్లి గేటు సమీపాన గుట్టలు అడవిని ఆనుకొని ఉన్నాయి. ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సీతాఫలాలు తెచ్చి రోడ్డుపైనే విక్రయించి ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు సీతాఫలాలను కొనుగోలు చేస్తున్నారు.

–నమస్తే తెలంగాణ, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట జిల్లా,అక్టోబర్ 11

'మల్లన్న' ఆలయంలో పూర్ణాహుతి

పూర్ణాహుతి పూజలో పాల్గొన్న ఆలయ ఈవో,అర్చకులు

చేర్యాల, అక్టోబర్ 11 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో దేవీ శ్రీ రాత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆల య ఈవో అలూరి బాలాజీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూర్ణాహుతి నిర్వహించారు.ఆలయ పూర్వపు సంప్రదాయం మేరకు ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్న దేవి శ్రీ రాత్రోత్సవాల్లో మూడో రోజు సందర్భంగా బిక్కనూరు మఠాధిపతి సదాశివ మహంత స్వామి పర్యవేక్షణలో పూజలు కొనసాగగా ఆలయ అర్చకుడు భాస్కర్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి మండపం వద్ద గణపతి పూజ, పంచచార్య, నవగ్రహ పూజ, ప్రధాన కళశ ఆరాధన, మంటప ఆరాధన, చతుషష్టి ఉపచార పూజ, సుహాసిని పూజ, రాజోపచార పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, మూలమంత్ర యుక్తంగా మహ లక్ష్మీహోమం, మంటపస్థిత దేవతా హోమం తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ స్వామి వారి ఆలయ ంలో పూర్వపు సంప్రదాయం ప్రకారం త్రీ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అమ్మవారికి మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు కొనసాగు తున్నాయన్నారు. ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, స్థానాచార్యులు పడిగన్నగారి మల్లయ్య, అర్చకులు, ఆలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

అ 'పూర్వ' సమ్మేళనం



అక్కన్నపేట: గురువులతో 1996-1997 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అక్కన్నపేట, అక్టోబర్ 11: మండలంలోని కట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1996-1997 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల శుక్రవారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. గురువులతో కలిసి పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మడుమ డకల నవీన్‌రెడ్డి, గుగులోతు శంకర్‌నాయక్, సదయ్య, మహేందర్, సంధ్య, గీత, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

బెజ్జంకి, అక్టోబర్ 11: మండలంలోని గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదివిన 1989-90 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శుక్రవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆ నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరైన బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 11 : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించడంలో విఫలైంది. దసరా పండుగ రోజు సొంత గ్రామాలకు వెళ్లాలనుకునే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.బస్టాండ్‌లో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూశారు. మారుమూల గ్రామాలకు సైతం బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ అధికారులు చెప్పడం తప్పా ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. ముఖ్యంగా పండుగల సందర్భంగా అనుకున్న విధంగా ప్రత్యేక బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట మోడల్, కొత్త బస్టాండ్‌లో శుక్రవారం దసరా పండుగకు స్వగ్రామాలకు వెళ్లాలనుకుని వచ్చిన వారికి బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

సిద్దిపేటలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

సిద్దిపేటలో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రజలు

విజయ దశమి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబర్ 11 : కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా మారిందని, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముస్మందు నిర్వహించే కార్యక్రమాలకు అన్ని వర్గాలు అండగా ఉండాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు.శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడారు. చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ పాలన కొనసాగించాడని,అధికార పార్టీలు చేసే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు.

నేడు శివాలయం వద్ద శమీపూజ

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 11: దసరా వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక శివాలయం వద్ద శమీపూజ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. ప్రతిఏటా నిర్వహిస్తున్న సంప్రదాయ వేడుకల్లో భాగంగా నిర్వహించే శమీపూజకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

బొమ్మల బహూకరణ

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 11 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో మూడు అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. శుక్రవారం భూంపల్లికి చెందిన వ్యాపారవేత్త బొమ్మెర సురేశ్ తన సొంత డబ్బులు రూ.10 వేలతో కొనుగోలు చేసిన బొమ్మలను అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులకు అందజేసి మమకారాన్ని చాటుకున్నాడు. అయితం శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అర్హులకే లేబర్ కార్డు ఇవ్వాలి

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 11 : నిజమైన అర్హులకే లేబర్ కార్డు ఇవ్వాలని సిద్దిపేట సుతారి పెద్ద సంఘం అధ్యక్షుడు తోట్ల నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేట సుతారి సంఘం భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ ఆఫీసుకు దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇష్టానుసారంగా కార్డులు ఇస్తున్నారని మండిపడ్డారు. కనీసం దరఖాస్తుదారుడు ఏం చేస్తాడు..నిజమైన కార్మికుడా కాదా అని తెలుసుకోకుండా గుర్తింపు కార్డులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిజమైన,నిరంతరం శ్రమించే కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పెద్ద రంగయ్య, చంద్రం,సంఘం నేతలు ఉప్పలి,ఎల్లయ్య, బాలకిషన్,ఎల్లం, శ్రీశైలం,మల్లేశం,రాజు,చెరుకు నారాయణ, ఆనందం పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నత విద్య

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 11 : విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తున్న ఏకైక యూనివర్సిటీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని ఆ విశ్వవిద్యాలయం సంయుక్త సంచాలకుడు, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సిద్దిపేట అంబేద్కర్ ప్రాంతీయ సహాయక అభ్యాసకుల విద్యా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేని గ్రామీణ యువత,పేదవారికి,ఉద్యోగంలో ఉండి ఉద్యోగోన్నతి పొందే వారికి అతి తక్కువ ఫీజుతో ఉన్నత విద్య అభ్యసించడానికి మంచి అవకాశాన్ని అంబేద్కర్ యూనివర్సిటీ కల్పిస్తున్నదన్నారు.అంబేద్కర్ యూనివర్సిటీలో చేరే వారికి ఈ నెల15 వరకుఅడ్మిషన్లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ శ్రద్ధానందం, అధ్యాపకులు ఎల్లం,రాజు, రాంరెడ్డి,వేణుగోపాల్, గోపాల్‌రెడ్డి,నర్సయ్య, రమణకుమార్, స్వామి పాల్గొన్నారు.